ఈ సందర్భంలో వీరు సంపాదించిన ప్రాతినిధ్యాల్ని కమ్యూనిస్టు విజయం అనడం కంటే కాంగ్రెసు అపజయాలు అనడం అర్థవంతంగా వుంటుంది. ముఖ్యంగా మద్రాసు, తిరువాన్కూరు కొచ్చిన్లలో వీరు కాంగ్రెసుకు ఒక పెద్ద కొరకరాని సమస్యగా పరిణమించారు.

వీరి కొచ్చిన గెలుపుల్ని అదృష్టం అసరాగా కాలం యిచ్చిన గొప్ప అవకాశంగా వీరు భావించుకోవలసి వుంటుంది. ఇంక పిచ్చి ఆవేశాలకు యీ గా యత నా నికి స్వస్తి చెప్పి బాధ్యతాయుతంగా వ్యవహరించవలసి వుంటుంది. గత చరిత్ర ప్రసాదించిన మచ్చని మాపుకోడానికి యీ క్రింది సలహాలు వీరికి కొంత ఉపకరించవచ్చు.

1. నాశనం ఆపాదించే విప్లవకాండకి మళ్లీ చేపట్టని రీతి విడాకులివ్వడం.

2. అవకాశ వాదాన్ని జారవిడిచి జాతీయ దృక్పథాన్ని అలవరచుకోవడం.

3. ఎంతటి గొప్ప వ్యక్తులైనా మార్క్సు, లెనిన్‌ల సిద్ధాంతాలకి కూడ కాలదోషం పట్టడంలో ఆశ్చర్యం లేదని తెలుసుకొని ఆదర్శాలకు భిన్నంకాని సందర్భ శుద్ధి ప్రదర్శించడం.

4. ప్రత్యర్థుల వాదాల్లో కూడ కొంత నిజముంటుందని సమరస భావం చూపి, అభ్యుదయ శక్తుల సమీకరించి నిస్వార్థంగా కృషి చేయడం.

క్షణికమైన విజయాలకు ఉబ్బి తబ్బిబ్బై బనిర్మాణయుతమైన పంథాలో ప్రజాక్షేమం కోసం కృషి చేయకపోతే గతాన్ని కోల్పోయి నట్లుగా వీరు భవిష్యత్తుకు కూడ నీళ్లు వదులుకోవలసివస్తుంది.

కమ్యూనిస్టంటే చేతిలో బల్లెం. నెత్తుటి రంగు వాడికోరలుగల రాక్షస రూపంగాక మనలాటి మానవుడే అని క్షమతో హృదయంలో స్థానమిచ్చిన ప్రజయొక్క విశ్వాసం ఈ పార్టీ నిలుపుకోవలసివుంది. మాస్కో వైటులు, స్టాలినిస్టులగా కాక అచ్చమైన భారత కమ్యూనిస్టుల్లా వీరు ప్రవర్తించాలి. జాతీయ దృక్పథం, సేవాధర్మం అలవరచుకోవాలి. మన దేశంలో ముఖ్యంగా మదరాసు రాష్ట్రంలోని రాజకీయాలు రసవత్తర ఘట్టంలో పడ్డ ఈ సమయంలో వీరు చక్కటి విజ్ఞతని, చిత్త శుద్ధిని ప్రదర్శించవలసివుంది.

కథానిక

# దాగివుండిన మణులు

"పుష్య"

ఆఫీసులో కొత్తగా ప్రవేశించాను. అంతా వింతగా వుంది. ఉద్యోగమంటే అసలే భయం. అందులోనూ గుమస్తా ఉద్యోగమంటే ఒకవిధమైన అసహ్యంకూడాను. ఏంచెయ్యడం?

వెళ్ళి కుర్చీలో కూర్చున్నానో లేదో కాయితాలకట్ట నామొహాన పారేశారు, చెయ్యమని. ఏమీ చెప్పందీ ఏమిటి చెయ్యడం? అసహ్యం మాట దేముడెరుగు, ముందుగా భయం పట్టుకుంది.

కాయితాలను యిటూ, అటూ తిప్పాను. అర్థం కాలేదు. ఇలాగ కూర్చుంటే లాభంలేదని, ఒక కాయితంతీసి భయపడుతూనే సూపరెంటుగారిని అడిగాను "ఇదేం చెయ్యమంటారు" అని. చర్రుమన్నాడు. నా మీద ప్రాణాలు మీద కెగిరిపోయాయి.

"ఏం చెయ్యమంటారు. చదివి రాయమంటారు. అబ్బబ్బ! చస్తున్నాం కదూ యీ కొత్త వాళ్ళతో. నా కాయితాలతోనే నేను చస్తూ వుంటే వీళ్ళకుకూడా ఎక్కడ చెప్పేది?"

అని సణుగుకున్నాడు.

తిన్నగా వెళ్ళి కుర్చీలో కూలబడ్డాను.

గంట పోయినతరువాత ఏమనుకున్నాడో ఏమో దగ్గరగా పిలిచి ఆ కాగితానికి సంబంధించిన కొన్ని విషయాలు పక్క సెక్షనులో అడిగి రమ్మన్నాడు. వెళ్లాను. ఆ సెక్షను సూపరెంటుగారికి కాయితం చూపించి, అడగబోతున్నానో లేదో, గదికి మూలగా కూర్చొని వున్నాయనను చూపించాడు.

ఇదంతా నాకు అగమ్యగోచరంగా వుంది. ఆయన బుర్ర దించుకొని ఏదో రాసుకుం

టున్నాడు. పావుగంట నిలబడ్డాను. చూడలేదు. చివరకు "ఒక్క నిముషం వుండండి" అంటూ చుట్టూవున్న నాలుగు కాయితాలు ఫైలులో కట్టి సూపరెంటు కిచ్చాడు.

నా కాయితం గురించి ఏమడగాలో తెలియదు. తోటి గుమస్తాయే గదా అతని దగ్గర కూడా అంత భయమెందు కనిపించింది.

"మా సూపరెంటుగారు దీన్ని మీకు చూపించమన్నారు."

అని అనబోతున్నాను. ఇంతలో ఆయన వెళ్ళిపోయాడు వాళ్ళ సూపరెంటు పిలుస్తున్నాడని.

"ఏంటయ్యా శాస్త్రీ! ఎన్నాళ్లు చెప్పినా నీ బుర్ర కెక్కకపోతే నే నెలా చచ్చేదీ?"

సూపరెంటు గుడ్లురిమాడు. శాస్త్రి చేతులు పిసుక్కుంటూ, తలవాల్చి నిలుచున్నాడు.

"ఇదే నా రాత. ఒకరోజా, రెండురోజులా. రెండు సంవత్సరాలై చెబుతున్నా. నీ తల కెక్కకపోతే ఎలాగ అంటాను. నీకు తెలియనూ తెలియదు. చెబితే అర్థమూ కాదు. ఎలా చావడం నీతో?"

"..............."

"నీకన్న ఒకటోక్లాసు పిల్లవాడు నయం. చెప్పిందేదో అర్థం చేసుకుంటాడు. ఇదేం రాతయ్యా?"

శాస్త్రి నోరు మెదపలేదు.

"రాను, రాను దేశం తగలడిపోతోందోయ్. యీ స్కూళ్లు ఇలాంటివాళ్ళను తయారుచేస్తే యిక చెప్పేదేముంది."

అంటూనే ఫైలును శాస్త్రి మీదకు విసరేశాడు. చేతికి తగిలి కిందపడిపోయింది.

ఇదంతా చూస్తున్న నాకు మతిపోయింది. తప్పుచేస్తే యిది తప్పయ్యా అని చెప్పాలిగాని యిదేం ప్రవర్తన. ఫైళ్ళు మీద వేసి కొట్టడానికి కూడా జీతాలిస్తున్నారేమో వీళ్ళకి.

కింద జల్లుకుపోయిన కాయితాలన్నీ తీసుకొని శాస్త్రి కుర్చీలో కూలబడ్డాడు. నా కాయితం సంగతి అడక్కుండా నే వెళ్ళిపోయాను.

మధ్యాహ్నం క్లబ్బులోకి కాఫీ తాగడానికి అందరూ వచ్చారు. శాస్త్రి కూడా వస్తాడనుకున్నాను. రాలేదు. ఆ రోజంతా నాకు మరొక ఆలోచన లేదు. ఆసంఘటనే కళ్లముందు కదిలేదు. గుమస్తా ఉద్యోగమంటే యెందుకు నీరసంగా చూస్తారో అర్థమయింది.

నాలుగు నెలలు గడిచాయి. తొలిరోజుల్లో గుమస్తా పనంటే అసహ్యంతోనూ, భయంతోనూ బాధపడ్డా, క్రమంగా అలవాటయిపోయింది. శాస్త్రితో చిన్న పరిచయం ఏర్పడ్డది. అతని గూర్చి పూర్తిగా తెలుసుకోవాలన్న కోరిక అధికంగా వుండేది. అమాయకుడు. ఒకళ్ళజోలికి పోడు. అందరూ మధ్యాహ్నం అరగంట యింటర్వల్‌లోనైనా పైకి వస్తారుగాని అతను అదీ చేయడు. యెప్పుడూ యేదో రాస్తూనే వుంటాడు.

ఒకనాటి మధ్యాహ్నం వాళ్ల సెక్షనునుంచి కేకలు వినిపించాయి. మొదట యెందుకో అనుకున్నానుగాని తరువాత చూస్తే మామూలు సంగతే. అందరిలాగా కాకుండా యెప్పుడూ రాస్తూనే వుంటాడు గదా యెందుకిలా తిట్లు తినవలసి వచ్చేదో నాకేమీ అర్థం కాలేదు.

ఇంటికి వెళ్ళిపోతూవుంటే దారిలో శాస్త్రి కనుపించాడు. పలకరించాను.

"మీ సూపరెంటేమిటి అలా గోల పెడుతున్నాడు మధ్యాహ్నం?"

"........"

"అయినా బావులేదండీ. మన వాళ్ళకు యింత పిసరు పదవిస్తే చాలు కళ్లునెత్తికెక్కుతాయి." అన్నాను అతన్ని సమర్థిస్తున్న ధోరణిలో.

"గుమస్తా ఉద్యోగానికి రాకనేపోవాలి. వచ్చేక అన్నీ వదలుకోవాలి." అన్నాడు విచారంగా.

"ఇంతకీ జరిగిందేమిటి?"

"ఏంలేదండీ ఆయన అంత హంగామా చేస్తాడుగాని. డ్రాఫ్టుకు తారీకు వెయ్యడం మర్చిపోయాను."

"అమాత్రానికే అంత..."

"ఏంచేస్తాను, నాకర్మ"

కంట తడి పెట్టుకున్నాడు.

ఆ సాయంత్రం యిద్దరం పార్కులో చాలసేపు కూర్చున్నాం, ఏవేవో చెప్పాడు.

తరువాత క్రమంగా మా యిద్దరికీ పొత్తు

కుదిరింది. బహు కష్టంమీద మధ్యాహ్నం యింటర్‌వల్‌లో పైకి తీసికొస్తూ వుండేవాణ్ణి. సాయంత్రం నాతోనే తిరుగుతూ వుండేవాడు.

ఆఫీసు ఊరికి మూడు మైళ్ళ దూరంలో వుంది. చుట్టూ పెద్దతోట, చూడ్డానికి చక్కగా వుంటుంది ఇంటర్‌వల్‌లో మామూలు ప్రకారం తోటలో చెట్టుకింద కూర్చున్నాం. శాస్త్రి మొహంలో కళ కాంతులులేవు. కూర్చొని ఆకాశంలోకి, గుబురుగా అల్లుకున్న చెట్లలోకి చూస్తున్నాడు. చాలసేపటివరకూ యెవరూ మాటాడలేగు.

"తప్పు పని చేశారుగాని, ఇంకా చదవవలసిందండీ మీరు. ఇప్పటినుంచీ వుద్యోగమేమిటి" అన్నాను గడ్డి మొక్కల్ని పీకుతూ.

"ఏం చేస్తానండి. చదవవలసిందే. నాకూ చదువుదామనే వుండేది. అకస్మాత్తుగా మా నాన్నగారు పోయారు. అంచేత చదువు మానేయడమే కాకుండా, యింటి భారం కూడా నెత్తినపడ్డాది."

"అయ్యో పాపం!" అన్నాను అప్రయత్నంగా.

ఇంకా ఏమైనా చెబుతాడేమో అనుకొన్నాను. చెప్పలేదు. ఆకాశంలోకే చూస్తున్నాడు. మధ్య నిట్టూరుస్తున్నాడు.

"ప్రపంచ ధర్మమే అంతేనేమో అనిపిస్తోందండి. చదువుకుందాం అన్నవాడికి ఏదో ఒకటి అడ్డు. చదువక్కర్లేదు మొర్రో అన్నవాడికి అన్నీ సదుపాయాలే!"

జాలిగా అన్నాను, యింకా యేమయినా విషయాలు తెలుసుకోవచ్చును గదా అని.

"చేసుకున్న కర్మకు నేనుగాక ఇంకెవరు అనుభవిస్తారు చెప్పండి. ఏనాడో ఘోరమైన పాపంచేశాను ఇప్పుడనుభవిస్తున్నాను."

విస్తుపోయాను ఇరవై యేళ్ళయినా లేని యీ మనిషికింత వేదాంతం ఎక్కడ అబ్బిందా అని.

"అదేమిటండీ శాస్త్రిగారూ! ఏమాటన్నా వేదాంతం చెబుతారు. ప్రతిదానికీ కర్మ అంటూ కూర్చుంటే వీలవుతుందా చెప్పండి."

"నేనేం లేనిది చెప్పలేదు. కర్మనకపోతే మరేమిటనమంటారు. అందరిలాగా ఒక డిగ్రీయైనా తెచ్చుకొనే యోగ్యతలేకపోయింది. ఈ యింటరు కొచ్చేసరికే పోవాలా మా నాన్నగారు కూడాను."

ఈ మాటలు చెబుతూవుంటే అతని పెదిమలు కొద్దిగా వణికేయి. మాటమాటకు కృంగిపోతున్నాడు.

"నిజమే పాపం!" అన్నాను చేసేదిలేక.

"అందులోనూ, అదైనా సవ్యంగా సాగిందంటారా. ఇంకా మూడు నెల్లకి పరీక్షలవుతాయనగా నాన్న మంచానపడ్డాడు. అవతల యింటి చాకిరీయే చేస్తానా, యివతల చదువే చదువుతానా? పరీక్షపోయిందని చులాగ్గా అనేస్తారేగాని అందులోవున్న సాధక బాధకాలు ఏమైనా ఆలోచిస్తారా."

"పోనీలెండి. జరిగిపోయిందానికి విచారించి లాభంలేదు."

రిస్టువాచీ చూసేను. వచ్చి గంటకుపైన అయింది. లేచి వెళ్ళిపోయాం.

రాత్రి యిద్దరం కలిసి సినిమాకి వెళ్లాం. మొదట రానన్నాడు. ఇంట్లో దెబ్బలాడతారన్నాడు. బలవంతంచేశాను. తప్పింది కాదు. మంచి సినిమా అవడంవల్ల నవ్వు ముఖాలతో బయటికి వచ్చేశాం. శాస్త్రిగూడా చాలా సరదాగా వున్నాడు.

చలి తీవ్రంగా వుంది. సిగరెట్టు ముట్టించాను.

"మీకో చిన్న శుభవార్త చెబుదామనుకుంటున్నానండి."

అన్నాడు శాస్త్రి. అర్థంకాక అతని ముఖంలోకి చూశాను.

"సాయంత్రం మావయ్య వచ్చాడు" అని వూరుకున్నాడు.

దేనికీ సంబంధంలేని యీ మాట యెందుకన్నాడో నాకర్థం కాలేదు. మావయ్యంటున్నాడు పెళ్ళికాని చేసుకోబోతున్నాడా?

"అయితే"

"మధ్యాహ్నం అడిగారు చూశారా, ఆ విషయం. చిన్న ఎగ్రిమెంటు చేసుకున్నాం, నాకు పెద్దచదువు చెప్పించడానికి. ఇక మిగిలినదీ కూడా చెప్పమంటారా?"

"బాగానేవుంది. ఇకనేం"

"చిన్న రిక్వెస్టు. మీరుమాత్రం యీ విషయం ఎక్కడా చెప్పకూడదు."

"అచ్ఛా. నాకేం కావాలండి. అయితే రేపు జూనులో మళ్ళా కాలేజీ గుమ్మ మెక్కుతారన్న మాట."

"అదే ఆలోచిస్తున్నాను. మరి ఆలస్యం కూడా ఎందుకు. మిగిలిన ఒక్క పార్టూ రేపు మార్చిలో అయిందనిపిస్తే, ఇక మనకే అడ్డంకూ వుండదు"

"ఇంతకీ అడగడం మర్చాను. దేనిలో చేర్తారేమిటి?"

ఈ ప్రశ్నకు జవాబు చెప్పే ముందు కొంత సేపు వూరుకున్నాడు కారణం తెలియదు.

"ఈ కాలంలో ఏవుద్యోగమైనా ఒకలాగే ఏడుస్తోందండి. నా మట్టుకేం తోస్తోందంటే మేస్టరు పనంత హాయి యింకోటి లేదు."

చెయ్యకచెయ్యక మేస్టరుపనే చెయ్యాలా అనిపించింది. అంత సరదాతో చెబుతున్న వాణ్ణి నిరుత్సాహ పరచకూడ దనుకున్నాను.

"చూశారూ, మన యూనివర్శిటీలో తెలుగు ఆనర్సుకోర్సు మూడు సంవత్సరాలూ అయేయి అనిపించానా చాలండి. ఎక్కడికెళ్ళినా లెక్చెరరయి కూర్చోవచ్చు."

నాకు చిన్న అనుమానం కలిగింది. మన వాడు సెప్టెంబరేటు గదా. ఎవడిస్తాడు ఆనర్సులో సీటు?

"ఫస్టుక్లాస్ వస్తేనేగాని ఇవ్వరే"అన్నాను

"దానికేం బాధలేదులెండి. యూనివర్సిటీలో ప్రొఫెసరు మా బంధువే. ఆ మాత్రం సీటు యిప్పించలేడా."

"తీసుకోగా, తీసుకోగా తెలుగు తీసుకుంటున్నారేమిటి, యింక మరేదీ లేనట్టు"

తెలుగుమీద వున్న అసహ్యాన్నంతనీ వెలిబుచ్చి అన్నాను. రుద్రరూపం దాల్చాడు.

"తక్కినవాట్లో ఒరిగిందేమిటి, ఇందులో లేకపోయిందేమిటి చెబుదురూ?"

"ఇంగ్లీషైనా తీసుకుంటే—"

"వెధవ యింగ్లీషు. చక్కని మాతృభాష వదలి యెక్కడిదో ఎందుకు మన తెలుగు భాషలోవున్న సొగసు చస్తే వొస్తుందిటండి మరో భాషలో."

అతని ధోరణివల్ల అప్రతిభుడనై వూరుకున్నాను, తరువాత మాటాడలేదు. ఆతనిల్లు దగ్గర పడ్డం వల్ల వెళ్ళిపోయాడు.

ఏది యెలాగవున్నా, నిరంతరం శాస్త్రి గురించే ఆలోచించే నాకు యీ వార్త వినగానే సంతోషం కలిగింది, మళ్ళా చదువులో ప్రవేశిస్తే యీ సూపరెంటు చీవాట్లైనా తప్పుతాయి గదా అని.

శాస్త్రిలో కొంతమార్పు వచ్చింది. వేదాంతం మాటాడడం తగ్గించాడు. రాత్రి చాల సేపటివరకూ మా యింట్లోనే గడుపుతూ వుండేవాడు.

డిసెంబరులో, పరీక్షకు అందరూ డబ్బు కడుతున్నారు. శాస్త్రి నడిగాను "డబ్బు కట్టావా" అని. తల దించుకున్నాడు. అర్థం కాక తరిచి అడగాను.

"కొన్ని చిక్కులొచ్చాయండి. మానేశాను"అన్నాడు.

తన చదువుగురించి అంతలాగ చెప్పినవాడు యిలాగ మాటాడతాడేమో అనుకున్నాను. బలవంతంచేశాను కట్టమని, విన్నాడు కాదు.

డబ్బు కట్టవలసిన కాలం దాటిపోయింది.

"మీరిలా చేస్తారని అనకోలేదండి"

"ఏం చెయ్యమంటారు. పండు గోటి దగ్గర పడుతోంది. మా పెద్దక్కయ్యని నాలుగేళ్లయి పండుక్కి తీసుకురాలేదు. ఎలాగయినా తీసుకురావాలి అంటోంది అమ్మ. మిగిలిన వాళ్ళందరూ చిన్నపిల్లలు. ఇంట్లో అన్నమేనా మానేసి వాళ్ళకు రెండు గుడ్డలు కుట్టించాలి. ఇవన్నీ చూసుకుంటూ ఇంటికథ నడిపించాలి"

"పండుగొస్తోందని పరీక్ష మానుకుంటారా చెప్పండి. ఇప్పుడు పరీక్షకు కూర్చోకపోతే, మళ్ళా ఒక యేడాది వూరుకోవాలి చదవాలంటే"

"నా బ్రతుకంతా ఒక్కలాగేవుంది. ఏం చేస్తాను చెప్పండి అంతా నా కర్మ."

అతని ధోరణి నాకేమీ అర్థం కాలేదు. పూర్వకాలంలో ప్రాపంచిక సౌఖ్యాలన్నీ అయిన తరువాత వేదాంతం మాటాడేవారట. ఈ కాలంలో ఇరవై యేళ్లు నిండని కుర్రాళ్ళే అధికంగా వేదాంతం మాటాడుతున్నారు.

కుర్చీలో కూర్చొని ఒకనాడు ఏవో కాయితాలు చూసుకుంటున్నాను. తొందరగా శాస్త్రి వచ్చి, "చిన్న మాట. యిలా రండి" అన్నాడు. వెళ్ళాను. ఇద్దరం కలిసి వరండా చివర చేరుకున్నాం.

"ఇదే ఆఖరుసారి మీతో మాటాడ్డం. ఇక నాకు బతకాలని లేదు." అని కంట తడి పెట్టుకున్నాడు.

"మళ్ళా ఏమొచ్చింది" అన్నాను ఆత్రుతతో.

"చిన్న తప్పు చేశానో లేదో, ఆఫీసరు దగ్గరికి లాక్కెళ్ళి పడతిట్టారు యిద్దరూను. పది రూపాయలు ఫైను వేశారు."

ఏమీ మాటాడడానికీ నోరు రాలేదు నాకు.

"ఇంటి సంగతిచూస్తే అలావుంది. ఇక్కడ చూస్తే ఇలావుంది. నేను బతికి ఏం లాభం చెప్పండి."

"కష్టాలు మనుషులకి కాక మానుల కొస్తాయా. మీరు ప్రతిదానికీ ఇలా అనుకుంటే ఎలాగ?"

"మీకు తెలియదండి. ఈ జన్మలో నాకు సుఖంలేదు. ఎంత వేగం చస్తే అంత వేగం సుఖపడతాను."

తరువాత శాస్త్రి కనుపించలేదు.

క్రమంగా మా యింటి పరిస్థితులు కూడా దిగజారుతున్నాయి. ఇంట్లో సంపాదించేవాళ్ళ కన్న కూర్చుని తినేవాళ్ల సంఖ్య హెచ్చయి పోయింది. ఊరినిండా అప్పులు పెరిగిపోతున్నాయి. స్నేహితులు కొందరు సలహా యిచ్చారు యుద్ధంలో చేరమని. మొదట సంశయించిన తరువాత అదే శరణ్యమయింది.

యుద్ధంలో చేరాను.

బంధువులనుండి, స్నేహితులనుండి, దూరమయిపోయాను. పడరాని పాట్లూ పడ్డాను. ఏం చెయ్యడం? సెలవుల కింటికొచ్చినప్పుడు శాస్త్రిని గురించి చాలమందిని అడిగాను. ఎవరూ సరియైన సమాధానం యివ్వలేదు.

శాస్త్రి ఏమైందీ తెలిసింది కాదు.

పదేళ్లయింది. యుద్ధ మప్పుడే పూర్తి కావస్తోంది. అందరూ ఎవరి ఇళ్లకు వాళ్లు పోతున్నారు. నేనుకూడా వచ్చేదాం అనుకుంటూ వుంటే కలకత్తాలో ఒక కంపెనీలో ఉద్యోగమైంది. కుటుంబాన్ని తీసుకొని వెళ్లిపోయాను. అంతే.

మళ్లా చాలా కాలానికి గాని తెలుగు మాట వినే భాగ్యం కలిగింది కాదు. ఆఫీసు పనిమీద మా మేనేజరు మద్రాసు వెళ్లమన్నాడు. స్నేహితుల నందర్నీ చూడొచ్చు కదా అని బయలు దేరాను.

రామం యింట్లో బస. రెండు రోజుల్లో అయిపోతుందనుకున్న పని పదిహేను రోజులయింది. ఈ లోపున చాలమంది స్నేహితుల్ని కలుసుకున్నాను.

సాయంత్రం నాలుగు గంటలకి మావాడు ఆఫీసునుంచి వచ్చి,"అలా వెళ్ళొద్దాం రారా" అన్నాడు.

కాఫీ హోటల్లో కాఫీ తాగి బీచీవేపు నడుస్తున్నాం. రోడ్డుమీద కరపత్రాలు పంచిపెడుతున్నాడు ఓ కుర్రాడు. ఒకటి పుచ్చుకున్నా. అందులో,

"కవికోకిల శ్రీ శాస్త్రిగారికి సన్మానం. అందరూ విచ్చేయ ప్రార్థన."అని వుంది.

మా వాడికి కవిత్వమంటే మహాపిచ్చి. అడక్కుండానే నన్ను లాక్కుపోయాడు.

హాలంతా జనంతో కిక్కిరిసివుంది. కవిగారు కనిపించలేదు. నాకు విసుగ్గా వుంది. పొగద్తలతో హాలు నిండిపోతోంది.

చివరికి ఒక ముసలాయన కవిగారి మెళ్ళో పూలదండ వేశారు. శాస్త్రిగారు ఉపన్యసించారు. సభముగిసింది. బ్రతికాంరా భగవంతుడా! అని మా వాడితో "రారా, పోదాం" అన్నాను. దగ్గరగా వెళ్లి కవిగారితో మాటాడితేనేగాని వాడికి తృప్తి వుండదు. మెల్లిగా లోపలికి వెళ్లాం.

పూలమాలాలంకృతులైన కవిగారు నాకంటబడ్డారు. నివ్వెరపోయాను.

"జ్ఞాపకం వున్నానా?"అని నా వీపుమీద తట్టేరు.

నాకు స్పృహ తప్పిపోయింది.